# ★ వ్యసనానికి బానిసలు ★

(కథ) —————— "శివ"

ఊరిలో పని పూర్తి చేసుకొని యింటికి బయల్దేరాడు రామానందుడు. ఊరికీ తన కుటీరం గ్రామానికీ మధ్య ఒక పెద్ద మామిడితోట ఉంది. ఆ తోటలోంచి వెళ్తున్నాడు. జీవితంలో ఎన్ని మార్పు లొచ్చాయ్! యీ ఊరిలో వారంతా తన్నెంతో గౌరవంగా చూస్తారనీ, వాళ్ళందరికీ తనొక స్వాములవారనీ తెలుసు. తన గత జీవితం ఎవరికేనా తెలుస్తే! ఎవరికి తెలుస్తుంది? అప్పుడే అది జరిగి పాతికేళ్ళు దాటాయ్. తెలిసినా, తెలుస్తే మాత్రం ఏం! ఒక్కసారిగా గత జీవితంలో ఒక్కొక్క సంఘటనే జ్ఞాపకం రావడం మొదలు పెట్టాయి.

అప్పటికి తనకి పద్ధెనిమిది! మహా ఉంటే ఇరవై యేళ్ళు. మొదటిసారిగా సరోజని కలుసుకోడం. కలుసుకొన్న కొద్ది రోజుల్లోనే ఆమెను ప్రేమించడం ఆమె చేత ప్రేమించబడడం. కాని ఎవరికీ వివాహం చేసుకోవాలని ఆదుర్దా లేక పోయింది. మొట్టమొదటిసారిగా ఆమెను కలుసుకొన్నదిల్లాంటి మామిడితోటలోనే. అందుకనే కాబోలు ఈతోట చూడగానే పాతజీవితంలో ఏదో ఒక సంగతి జ్ఞాపకానికి వస్తూఉంటుంది. కాని కొన్నాళ్ళకి సరోజ తనొక్కణ్ణే కాక యింకెవర్నో ప్రేమిస్తోందని తెలిసింది. కాని మొఖంమీదనే అడగలేకపోయాడు సరోజని. రోజురోజుకీ అనుమానం. అనుమానానికి తోడు కొన్ని నిదర్శనలు ఎక్కువైపోయాయి. ఆగలేక ఒకసారి అడిగేశాడు.

"సరోజా! నువ్వు నన్ను తప్ప ఎవర్నైనా ప్రేమిస్తున్నావా?

'ఏం?' అంది సరోజ తన ప్రశ్నలోని ఆవేదనను అర్థం చేసుకోనుండా.

'అదికాదు. మనమిద్దరం త్వరలో వివాహం చేసుకోబోతున్నాం గదా...'

'ఎవరన్నారు?'

'ఐతే నీవు నన్ను ప్రేమించటం లేదా?'

'లేకేం...'

'అల్లాంటప్పుడు నువ్వా రాజారావుతో...'

'అది నా యిష్టం.'

'అంటే నువ్వు నన్ను ప్రేమించటం లేదన్న మాట?'

'నిన్నూ ప్రేమిస్తున్నాను. రాజారావునీ ప్రేమిస్తున్నాను. నువ్వు అందంగా ఉన్నావు గనుక నిన్ను, రాజారావు డబ్బిస్తున్నాడు గనుక రాజారావునీ ప్రేమిస్తాను. అందుకనే ఎవర్నీ పెళ్ళి చేసుకోననేది?'

'ఛీ! డబ్బుకోసం ఆశపడే నీచురాలవని నేననుకోలేదు. ఇవ్వాళనుంచీ నీకూ నాకూ ఏమీ సంబంధం లేదు' అన్నాడు వెళ్ళిపోతూ.

పాపం సరోజ ఆవేళే చెబ్దామనుకొంది తను గర్భవతినని. ఎవరివల్ల కలిగిందో తనకే నమ్మకం లేదు. ఇంతవరకూ ఎవర్నీ కాదనలేక పోయింది. ఇప్పుడు రామారావు (రామానందుని అసలు పేరు) వెళ్ళిపోవడం తనకొకవిధంగా లాభం అయింది. రాజారావు కోతిలాంటి వాడైనా యిప్పుడు డబ్బుకోసం, గర్భంలో ఉన్న శిశువు కోసం అతన్నే పెళ్ళిచేసుకోవాలి. ఇష్టం లేక పోయినా, అయినా రామారావుని బ్రతిమాలు కొందామని బయలుదేరింది. రాజారావుని పెళ్ళి చేసుకొన్నా మనిద్దరిమధ్య స్నేహానికి ఏమీ అడ్డుండదని చెబ్దామనుకొని. కాని రామారావు ఎక్కడికెళ్ళాడో వారం రోజులైనా తెలియ లేదు.

ఆ పైవారంలో రాజారావుకూ సరోజకు వివాహం జరిగిపోయిందని ఎవరో చెప్పారు.

అక్కణ్ణించి సరాసరి ఈ ఊరే వచ్చాడు రామారావు. కొన్నాళ్ళు అక్కడా అక్కడా వారాలు చేసుకొనీ, కొన్నాళ్ళు కడుపు మాడ్చుకొనీ, ఆఖరికి ఒక స్వాములవారి దగ్గర శిష్యుడుగా చేరాడు. ఆ స్వాములవారు పోడంతో తనే ఆ స్వాములవారి హోదాలోకి వచ్చాడు. రోజూ సాయంత్రం ఏదో కాలక్షేపం చెయ్యడం కన్న ఏమీ ఎక్కువ పనిలేదు. వినడానికి వచ్చే

వాళ్లంతా కూరలో పళ్ళో డబ్బో ఏదో ఒకటి తమ శక్తికొద్దీ యిస్తారు. ఒక కోమటి మాత్రం అక్కడికి రెండు మైళ్ళ దూరంలో ఉన్న పల్లెటూర్లో ఒక పాక వేయించి యిచ్చాడు ఊరికే. ఆపాక ఊరికి చివర్న ఉంది. స్వాముల వారికి వండిపెట్టడానికి మాత్రం ఒక శిష్యుడున్నాడు ఆపాకలోనే. ఇవాళ తోటగుండా వెళ్తో ఉంటే జ్ఞాపకం వచ్చిన యీ జీవితాన్ని తల్చుకుంటూంటే ఎందుకో వళ్ళు వణకడం మొదలెట్టింది. అలాగే మెల్లిగా కుటీరానికి చేరుకొన్నాడు.

*       *       *

భోజనా లయినతర్వాత 'యిందాకా మీకోసం ఎవరో వచ్చారండి. పేరు చెప్పమంటే మళ్ళీవస్తానని వెళ్ళిపోయాడు' అన్నాడు శిష్యుడు.

'ఎవరై ఉంటారబ్బా' తనకోసం కుటీరం దాకా వచ్చేవాళ్లెవరూ లేరే-'ఎలా ఉన్నాడు' అని అడిగాడు.

'ఆ! ఎవడో బికారి వెధవలాగున్నాడు. ఏదో పంచో, అంగోస్త్రమో యిస్తారని వచ్చి ఉంటాడు' చూడ్డానికి చాలాఅసహ్యంగా ఉన్నాడు లెండి. తందా మనుకొంటే భయమేసింది.'

'తన్నడ మెందుకూ. వాడూ నీలాంటి మనిషే' యింతట్లోకి ఎవరో తలుపు కొట్తూన్నట్లు చప్పుడైంది.

'ఆ! వచ్చే వాడేనండీ. వచ్చాడు.'

రామానందుడు మెల్లిగాలేచి వెళ్ళాడు వీధి గుమ్మం దగ్గరికి. ఎదురుగా ఒక పాతికేళ్ళ యువకుడు, మాసిపోయిన గడ్డం, పీక్కుపోయిన బొట్టూ, కుళ్ళుకంపు కొట్తున్న బట్టల్తో తయారయాడు.

'రామానంద స్వాములు మీరేనా?'

'అవును. మీ రెవరు?'

'నన్నెరుగరా? సరిగ్గా పరకాయించి చూడండి!' రామానందుడు రెండు మూడుసార్లు ఎగా దిగా పరకాయించి చూచాడా అపరచితుణ్ణి.

'క్షమించాలి. మీ రెవరో తెలియనందుకు విచారిస్తున్నాను.'

అబ్బే! దానికేమిలెండి! మీకూ నాకూ తెలిసిన వ్యక్తిని చూపెడ్తానుండండి! అని జేబులోంచి ఒక చిన్న ఫోటో తీసి అందించాడు.

రామానందుడు ఒక క్షణంపాటు యీ ప్రపంచాన్ని మరచిపోయాడు. కాని తన తొట్రుపాటు మొఖంలో కనపడకుండా చేసుకో గలిగాడు. ఆశ్చర్యం ఆ ఫోటో తనదే!

'ఇప్పుడైనా తెలిసిందా నేనెవర్నో' రెండు రోజులనుంచీ తిండీ తిప్పలూ లేకుండా నిన్ను వెదుకుతూ బయల్దేరాను. చాలా ఆకలిగా ఉంది. ఏమేనా ఉంటే తినడానికి కావాలి.

'ఇల్లా లోపలికి రా' అని వంటింటి పక్కనున్న గదిలోకి తీసుకువెళ్ళి శిష్యుడిచేత ఆపూట మిగిలిన వంటకాలు తెప్పించాడు. ఆదుర్దాగా ఒక్కొక్కటే పూర్తిచేసాడు ఆ వచ్చిన వ్యక్తి.

'మజ్జిగ కావాలా?'

'ఆ!'

శిష్యుడిచేత మజ్జిగ తెప్పించాడు. శిష్యుడు తన గదిలోకిపోయి పడుకున్నాడు. మజ్జిగ తాగాక జేబులోంచి ఒక సారాసీసా తీసి బయట పెట్టాడు.

'నీకు తాగుడు కూడా అలవాటుందా?'

'లేకపోతే ఎలా బతుకుతున్నా ననుకొన్నావ్? ముందు నాసంగతి చెప్పు. నీవు నన్ను కొడుతుగా అందరిముందూ వప్పుకుంటావా?'

'సరోజ ఎక్కడుందీ? అసంగతంతా చెప్పు-' అన్నాడు రామానందుడు మొఖం అదోలాగ పెట్టి.

అవును. నువ్వు ఆవిడని అన్యాయం చేసి వెళ్ళిపోయాక ఆవిడ పెళ్ళిచేసుకొంది. అప్పుడు అమ్మే చెప్పుతూ ఉండేదిలే నీ తప్పేంలేదని. రాజారావుని పెళ్ళిచేసుకున్న ఏడెనిమిది నెల్లకి,



నే పుట్టానట. అప్పటికీ అనుమానం తీరక అడిగాట్ట. అడిగితే, పెళ్ళి కాకముందు తన మూలానే నెల తప్పిందని చెప్పిందిట. రాజారావు కూడా నీ లాగే వివాహం చేసుకోకుండా స్త్రీలను లాలించేవాడుగనుక నమ్మక తప్పలేదు. ఆ అనుమానంకొద్దీ ఆమెను తిట్టీ కొట్టీ హింసిస్తూండేవాడు. పాపం ఆమె అన్నీ భరిస్తూండేది. నన్ను చూసినా వాడికి పడేది కాదు.

నాకు పదహారేళ్లొచ్చేసరికి వాడికి బాగా నిర్ధారణైంది నేను తన కొడుకుని కాదని. ఒక రోజున అమ్మ, యింకా వారం రోజులకు పోతుందనగా,

'ఆ!' సరోజ పోయిందా?.

'అవును జబ్బు చేసి పోయింది.'

'ఏంజబ్బు?'

'క్షయ. బాలాబాధపడింది. యింక వారం రోజులకి పోతుందనగా నాతో అంతా చెప్పేసింది. అప్పటినుంచీ రాజారావుని చూస్తే నాకు మరీ కోపం ఎక్కువయేది. ఇంక అమ్మ చచ్చిపోయాక ఏమనుకొన్నాడో ఒకరోజున నన్ను పిల్చి యింట్లోంచి వెళ్ళిపొమ్మన్నాడు. అప్పటికీ నాకు చాలా దురలవాట్లు అలవాట్లయినై. దానికంతా వాడిదే తప్పు. చిన్నప్పుడు బడికి పంపించకపోవడం మూలాన చెడ్డసహవాసాలు చేసాను. బాగా తాగుడుకూడా అలవాటైంది. కాని ఎవరికీ తాగుతానన్న సంగతిమాత్రం తెలియదు. సరే. ఆవేళ యింట్లోంచి వెళ్ళిపొమ్మనే సరికి బలే కోపమొచ్చింది. పాపం వాడికట్టే బలంలేని మూలానే రెండు మూడు గుద్దుల్తో కూలబడ్డాడు, నెత్తురు కక్కుతూ. అక్కణ్ణించి యిల్లు వదిలేసి రెండు నెలల్నించీ నిన్ను వెదకుతూ బయల్దేరా. కాని నీ సంగతి తెల్సిన వాళ్ళెవరో యిద్దరో ముగ్గురో ఉన్నారు. ఆఖరుకు రామానందుడంటే నువ్వేననుకొని. యిక అందరిముందూ ఒప్పుకుంటావా?.

'లేకపోతే?'

'లేకపోతే తెలియదూ?' అంటూ మొల్లోంచి కత్తితీసి చూపించాడు.

'వద్దు. నా జీవితం పాడుచెయ్యకు. నన్ను వదిలిపో. కావాలంటే డబ్బిస్తాను.'

'ఏం లాభంలేదు. చెప్పేయ్.'

ఒప్పుకుంటావా. లేదా. ఒకటి. రెండు. మూడు. నాల్గు. అయిదు.

రామానందుడు కేమీ తోచలేదు. అంతగా ఐతే ఖాళీసీసా తీసుకొని విసిరేద్దామని తీసాడు.

ఆరు. ఏడు. ఎనిమిది.

యింకేం ఆలోచించకుండా సీసాతీసుకొని నెత్తిమీద కొట్టాడు. ఆ దెబ్బతో ఆ వచ్చిన వాడు కిందపడిపోయాడు.

తెల్లారి శిష్యుడు గురువుగారి గదిలో కాలు పెట్టేటప్పటికి గదినిండా ఏదో జిడ్డుజిడ్డుగా ఉండి జారిపడ్డాడు. దీపం తెచ్చి చూసేసరికి గురువుగారి మెడలోంచి రక్తం తెగకారుతో ఉంది. బాబోయ్ స్వాములవార్నెవరో చంపారయ్యో అంటూ పరుగెత్తుకు వెళ్ళి చుట్టుపక్కల ఉన్న యిళ్ళలో వాళ్ళనీ, దగ్గరేవున్న పోలీసుల్నీ తీసుకు వచ్చాడు.

అంతావచ్చి చూసేసరికి గురువుగారి మెడలో ఆమూలనుంచి యీ మూలవరకూ కత్తి గుచ్చబడి ఉంది. పక్కనే పగిలిపోయిన సారా సీసా, స్మృతి తప్పి పడి ఉన్న తాగుబోతువాడు పడి ఉన్నారు. గురువుగారు మాత్రం యీ లోకంలో లేరు.

పోలీసులు వెంటనే ఆ తాగుబోతుని అరెష్టు చేసి తీసుకు పోయారు. ఎవడో తాగుబోతు స్వాములవార్ని చంపాడనుకొన్నారు. అంతా శిష్యుడు మాత్రం యిద్దరూ దెబ్బలాడుకోవడంలో స్వాములవారోడి పోయిన మూలాన చంపబడ్డాడనుకున్నాడు.

కాని ఎవరూ నిజాన్ని ఊహించుకోలేక పోయారు-స్వాములవారే తనంతటతాను పొడుచుకొన్నాడేమో నని.

[ఆధారం: మొపాసా]